క్లుప్తంగా

ప్రొసీడింగ్ అందజేత



ప్రొసీడింగ్ అందిస్తున్న జెడ్పీటీసీ శ్రీరాంశ్యామ్

జమ్మికుంట: మండలంలోని రంగమ్మపల్లి బీరప్పస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యామ్ హాజరై మొక్కులు చెల్లించి బీరప్ప ఆలయం అభివృద్ధి కోసం జెడ్పీ నిధుల నుంచి రూ. లక్షా యాభై వేల ప్రొసీడింగ్ అందజేశారు. నిధులు మంజూరు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

రామడుగు: రామడుగు సహకార సంఘం, షానగర్‌లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సంజీవరెడ్డి ప్రకటనలో తెలిపారు. జీలుగ 30 కిలోల బస్తా (రెండున్నర ఎకరాలకు) రూ.843, జనుము 40 కిలోలు(రెండున్నర ఎకరాలకు) రూ.1,225 అందించడం జరుగుతుందని, అవసరమైన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో సంప్రదించాలన్నారు.

ఆర్ఆర్ఆర్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న స్వప్న

జమ్మికుంట: వినియోగంలో లేని పాతవస్తువులు మరొకరికి అందించేందుకు ఆర్ఆర్ఆర్(రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కేంద్రం ఉపయోగపడుతుందని ప్రజలు సహకరించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నకోటి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని 19 వార్డులో ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంట్లో ఉపయోగించని వస్తువులు పాత దుస్తులు, పుస్తకాలు, బొమ్మలు, ప్లాస్టిక్, తదితర వస్తువులు అందించాలని సూచించారు. పాత వస్తువులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని, కొత్తపల్లిలో ఏడు రోజుల వరకు సెంటర్ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీలు జేరిపోతుల సృజన, ఎండీ భాను, అంగన్‌వాడీ టీచర్, రమ, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇసుక వేలం



గన్నేరువరం: మండల కేంద్రంలోని ఇసుక కుప్పలకు ఈ నెల 24న వేలం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ అనంతరెడ్డి సోమవారం తెలిపారు. 20 ట్రాక్టర్ టిప్పుల ఇసుకకు వాటి వద్దే ఉదయం 11 గంటలకు వేలం ఉంటుందని, వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చేయాలని వెల్లడించారు. 24 గంటల వ్యవధిలో వేలం మొత్తం డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని, అనంతరం ఇసుక తీసుకెళ్లడానికి అనుమతి ఇస్తామని తెలిపారు.

రాష్ట్ర మత్స్య సహకార సంఘాల చైర్మన్‌గా రవీందర్



పుష్పగుచ్ఛం అందిస్తున్న గూడెల్లి తిరుపతి

గన్నేరువరం: హైదరబాద్‌లోని ఫిషరీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర మత్స్య సహకార సంఘాల చైర్మన్‌గా పిట్టల రవీందర్ పదవీబాధ్యతలు చేపట్టారు. కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ గూడెల్లి తిరుపతి హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, రవీందర్‌కు అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముదిరాజ్‌ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం, ఫిషరీస్ మాజీ చైర్మన్ పోలు లక్ష్మణ్, మాజీ సర్పంచ్ పిట్టల రవీందర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తే

- ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న జీపీ భవన నిర్మాణ పనులు
- సమీపిస్తున్న గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం
- గడువులోపు పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు



ముత్తారంలో స్లాబ్ వరకు గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు

శంకరపట్నం: గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిసేలోపు ఆయా గ్రామాల్లో జీపీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యేనా సందేహం ప్రజల్లో నెలకొంది. శంకరపట్నం మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా మక్త, గొల్లపల్లి, కల్వల, చింతగుట్ట కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డాయి. నూతన గ్రామ పంచాయతీలు ఏర్పటి ఏళ్లు గడుస్తున్నా ఆ గ్రామాల్లోని పాఠశాల, అద్దెభవనాల్లో జీపీలను నిర్వహిస్తున్నారు. 12 గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కేశవపట్నం, ఆముదాలపల్లి, కరీంపేటలో కొత్త భవనాలు నిర్మించి ప్రారంభోత్సవం చేశారు. ప్రస్తుతం చింతలపల్లి, ముత్తారం జీపీ భవనాలు నిర్మాణం చేస్తుండగా మొలంగూర్‌లో పనులు ప్రారంభం కాలేదు.

నిధులు మంజూరు

కొత్తగా ఏర్పడిన మక్త, చింతగుట్ట, గొల్లపల్లి, కల్వల గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. నూతనంగా ఏర్పడిన జీపీలే కాకుండా అంబాల్‌పూర్, లింగాపూర్, మెట్‌పల్లి, మొలంగూర్,రాజాపూర్‌లో నూతన భవనాలు నిర్మాణం చేసేందుకు నిధులు విడుదలయ్యాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం 2024 ఫిబ్రవరితో ముగియనుంది. ఎమ్మెల్యేల పదవీకాలం ఈ ఏడాది డిసెంబర్‌తో ముగియనుండడంతో ఆలోపే నూతన భవనాలు పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాల్సి ఉంది.

నత్తనడకన పనులు



ముత్తారం జీపీ భవనం పనులు నత్తనడకన సాగుతున్నాయి. పిల్లర్లు, స్లాబ్ వేసి వదిలిపెట్టారు. ఈ ఏడాది పూర్తి చేస్తారన్న నమ్మకం ప్రజలకు లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ నూతన గ్రామ పంచాయతీ భవనం పనులు మధ్యలో ఆగిపోయాయి. పనులు పూర్తి చేసి ప్రారంభించాలి.

– మారవేని రాజయ్య, ముత్తారం

పనులు ప్రారంభం కాలేదు



మొలంగూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం కోసం కొబ్బరికాయ కొట్టినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇకనైఆ అధికారులు స్పందించి భవనం నిర్మాణం పనులు చేయించాలి.

– దండు కొంరయ్య, మొలంగూర్

అక్టోబర్‌లోపు పూర్తి



ముత్తారం, చింతలపల్లి గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులు అక్టోబర్‌లోపు పూర్తి చేయిస్తాం. నూతనంగా ఏర్పడిన నాలుగు గ్రామాలతో పాటు నిధులు మంజూరైన గ్రామాల్లో పనులు ప్రాంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– బషీరొద్దీన్, ఎంపీడీవో, శంకరపట్నం

ధాన్యం దోపిడీ అరికట్టాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడీ జరుగుతోందని సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి అన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ అనంతరెడ్డికి పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించే క్రమంలో అనేక కొర్రీలు పెడుతూ క్వింటాల్‌కు 8 నుంచి 10 కిలోలు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో అధికారులు నిర్లక్ష్యం వీడి కేంద్రాల్లోని ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు. పలువురు రైతులు ఆందోళన చేపట్టారని, దళారులకు విక్రయించిన బాగుడేందని వాపోయారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి చొక్కాల్ల శ్రీశైలం, నాయకులు బోయిని మల్లయ్య, కూన మల్లయ్య, కూన సురేష్, సంబు, తిరుపతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యేదెలా..?

- అధికారులు హాజరుకాని సమావేశాలు ఎందుకు
- ప్రత్యేక సమావేశానికి డుమ్మాకొట్టిన ప్రజాప్రతినిధులు



హాజరైన ప్రజాప్రతినిధులు (ఇన్‌సెట్లో) సమావేశంలో అధికారులు, ఎంపీపీ

గంగాధర: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. ఈ నెల 17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ శ్రీరాం మధుకర్ అధ్యక్షతన ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా నిర్వహించారు. సమావేశానికి డివిజన్ స్థాయితో పాటు, మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడంతో సర్పంచులు, ఎంపీటీసీలు నిరసన తెలిపారు. అధికారులు హాజరుకాని సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. స్పందించిన ఎంపీపీ మరోసారి అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిద్దామని సమాధానం ఇచ్చారు. సోమవారం అధికారులతో సమావేశం ఏర్పాటు చేయగా ఎంపీటీసీలు, సర్పంచులు నామమాత్రంగా హాజరయ్యారు. మండలంలో 33 మంది సర్పంచులు, 14 మంది ఎంపీటీసీలు ఉండగా సమావేశానికి మహిళా ప్రజాప్రతినిధుల భర్తలతో కలిసి 16 మంది హాజరయ్యారు. సమావేశంలో విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కూరగాయల తోటలు వర్షాలకు దెబ్బతిన్నాయని రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: పేదింటి ఆడబిడ్డల పెళ్లికి అండగా ఉండటానికి ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పథకాల అమలు చేస్తున్నారని, దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం షీ టీంలు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు

సద్వినియోగం చేసుకోవాలి

రామడుగు: రైతుల అవసరాల కోసం ఏర్పాటు చేసిన కస్టమ్ హైరింగ్ కేంద్రం (వ్యవసాయ యంత్ర పరికరాల అద్దె కేంద్రం)ను సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీరామ మండల సమాఖ్య ఆధ్వర్యంలో కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవిత, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, సర్పంచ్ పంజాల ప్రమీల, ఏపీఎం ప్రభాకర్ పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- ప్రత్యేక ఆకర్షణగా ధూంధాం సాంస్కృతిక కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లకు చేరువవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఏర్పాటు చేస్తున్న దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని మహాత్మానగర్‌లో క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నియోజవర్గ వ్యాప్తంగా జూన్ రెండు నుంచి 21 రోజులపాటు వేడుకలకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రతి గ్రామంలో ప్రజలు భారీ సంఖ్యలో భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండల కేంద్రంలో ధూం ధాం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నామని, క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మకు నివాళి



హుజూరాబాద్: నివాళి అర్పిస్తున్న నాయకులు

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలో సోమవాం బీఎస్పీ ఆధ్వర్యంలో ఆంధ్రసభ వ్యవస్థాపకుడు, దక్కన్ దళిత ఉద్యమ నాయకుడు భాగ్యరెడ్డివర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రాంచంద్రం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ... జోగిని, దేవదాసి వ్యవస్థను రద్దుచేయడంలో ప్రధాన భూమిక పోషించారని, బాలికలు విద్యనభ్యసించడానికి పాఠశాలలను నెలకొల్పారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కార్యకర్తలు బాలయ్య, ప్రమీల, వెంకన్న, సంపత్, రమేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మానకొండూర్ మండల కేంద్రంలో..

హుజూరాబాద్: స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భాగ్యరెడ్డివర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ సంస్థానంలో దళితుల విద్యకు ప్రత్యేక శ్రద్ధ చూపాడని నిజాం ప్రభుత్వం ఉర్దూ మీడియంలో పాఠశాలలు నిర్వహించిన సమయంలో భాగ్యరెడ్డివర్మ తెలుగు మీడియంలో విద్య అందించాలని పాఠశాలలను నెలకొల్పిన సంఘ సంస్కర్త అని అన్నారు. న్యాయవాది, అంబేడ్కరిస్టు దొంత భద్రయ్య, మాల మహానాడు రాష్ట్ర నాయకులు పాక సతీష్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్ సంజీవ్, నాయకులు స్వామి, జనార్దన్, రఘుపతి, సమ్మయ్య, బాబు, సమ్మయ్య, నారాయణ, శిరీష, దొడ్డ సమ్మయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపునకు సహకరించాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న శాంతికుమార్

చొప్పదండి: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలకు పట్టణ ప్రజలు సహకరించాలని, సిబ్బంది సూచనల మేరకు తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. పట్టణంలోని మూడు, నాలుగు వార్డుల్లో సోమవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, వార్డు కౌన్సిలర్లు మహేషుని సంధ్య, చేపూరి హేమ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, రవీందర్, రాజయ్య, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పరిశీలన



రామడుగులో నర్సరీని పరిశీలిస్తున్న విజయరావు

రామడుగు: మండలంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను సోమవారం గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర కమిషన్ కార్యాలయం సహాయ సంచాలకుడు విజయరావు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్త, మురుగునీటి నిర్వహణ, పారిశుధ్యం, సెగ్రిగేషన్ షెడ్లు వినియోగం, నర్సరీ, వైకుంఠధామం తదితర వాటి పనితీరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో హరికిషన్, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ రమేష్, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పంజాల ప్రమీల, యూనిసెఫ్ క్లస్టర్ ఫెసిలిటేటర్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

నామినీకి బీమా చెక్కు

జమ్మికుంట: పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీకి చెందిన బోళ్ల భరత్ ఇటీవల మృతి చెందాడు. నామిని బోళ్ల దివ్యకు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ డెత్ క్లెయిమ్ పాలసీ ద్వారా రూ.4,75,000 ప్రీమియం చెక్కును డివిజనల్ మేనేజర్ సుధాకర్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గాజుల భాస్కర్, ఏజెన్సీ మేనేజర్ రమేష్‌బాబు, చేపూరి అనితసతీష్, పూదరి తిరుపతి పాల్గొన్నారు.

నియామకం

హుజూరాబాద్: ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన గడ్డం సమ్మయ్యను నియమించినట్లు ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి సోమవారం తెలిపారు. గడ్డం సమ్మయ్య మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాల్లో ఎస్సీల్లో ఉన్న 57 ఉపకులాలవారు అన్యాయానికి గురవుతున్నారని, మొదటి విడత దళితబంధులో ఒక్కశాతం లబ్ధి పొందలేదని, మాల, మాదిగలు అందులో అధికార పార్టీ కార్యకర్తలకు మాత్రమే దక్కాయని ఆరోపించారు. చిందు, మోచి, హోలియదాసరి, మాలజంగం, బేడ బుడగజంగం, సమగర, బైండ్ల, దక్కలి, గోసంగి, బ్యాగరి, మష్టిన్, దొంబరా, మిథ అయ్యవార్లు మొదలైనవారికి రెండో విడత దళితబంధులో 40 శాతం కేటాయించాలన్నారు. ఉపకులాల ప్రజల హక్కుల సాధన, సంఘం బలోపేతం కోసం సంఘ నిర్ణయం మేరకు నియామాల పరిధిలో కృషి చేస్తానన్నారు.

క్రీడలు స్నేహభావం పెంపొందిస్తాయి



క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న దేవేందర్‌రెడ్డి

తిమ్మాపూర్: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు క్రీడల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మహాత్మానగర్‌లో క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు. ఇటీవల మండల స్థాయిలో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైనా క్రీడాకారులకు సుమారు రూ.50 వేల సొంత ఖర్చులతో టీషర్టులు అందజేసి మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, ఆసక్తి ఉన్నదానిలో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. క్రీడల్లో రాణించిన వారికి కూడా విద్య, ఉద్యోగాల్లో అవకాశాలను ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో మండల పీఈటీ లు సమ్మయ్య, బన్సీలాల్ శ్రీనివాస్, శ్రీలక్ష్మి, స్నేహలత, క్రీడా కారులు తదితరులు పాల్గొన్నారు

గన్నేరువరం: మండల స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలు, పురుషుల జట్లకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో క్రీడాదుస్తులను పురుషుల జట్టుకు లయన్స్ క్లబ్ సభ్యుడు బొడ్డు సునీల్, మహిళ జట్టుకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న వితరణ చేశారు. ఎంపీపీ మల్లారెడ్డి, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో నర్సింహారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ రాజాబాబు, బాబు శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ బుర్ర మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలం నుంచి జిల్లా కేంద్రంలో జరిగే సీఎం కప్ క్రీడా పోటీలకు ఎన్నికైన 62 మంది క్రీడాకారులకు సోమవారం మానకొండూర్ రైస్ మిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి



ఇల్లందకుంటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: యువశక్తిని మేల్కొలిపే దిశగా హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను అనుసరించి, రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను జిల్లాలోని నియోజకవర్గంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు. సోమవారం జమ్మికుంట పట్టణంలో మాట్లాడారు. జూన్ 2వ తేదీ వరకు 76618 99899 నంబర్‌కు మిస్డ్‌కాల్‌తో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో బహుమతులు స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్, ఇవ్వనున్నామని, ప్రోత్సాహకంగా మరో 40 బహుమతులు అందించనున్నామని, నియోజకవర్గ టాపర్‌గా నిలిచిన మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటీని బహుమతిగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు అభిలాశ్, పర్వీన్, సబ్బని విశ్వ, మైమూద్, దురిశెట్టి శ్రీను, శేఖర్, విఘ్నేస్, మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: క్విజ్ పోటీల్లో యువకులు పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వంగ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఆన్‌లైన్ క్విజ్‌కు సంబంధించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి విడుదల చేశారు. నాయకులు ఆరెల్లి రమేశ్, మంకు ఐలయ్య, మర్రి వీరారెడ్డి, జిల్లెల జలేందర్‌రెడ్డి, ముద్రబోయిన రాములు, గుండారపు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

శంకరపట్నం: సబ్సిడీపై జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ముత్తారం ఆగ్రోస్, తాడికల్, మెట్‌పల్లి, గద్దపాక సహకార సంఘాల్లో రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ అందజేసి, పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు తీసుకోవాలని సూచించారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: మండలంలోని వన్నారం గ్రామం శ్రీరామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవిత, మాజీ ఎంపీపీ తవుటు మురళీ, మార్కొండ కిష్టారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మండల రైతుబంధు కమిటీ కోఆర్డినేటర్ జూపాక కరుణాకర్, జాడి లక్ష్మీ, ఎంపీటీసీ హరీశ్, బొల్లం రాజమౌళి పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలాభిషేకం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారంలో శ్రీరేణుక ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం గీత కార్మికులు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించారు. గౌడశెట్టి పూజారుల సమక్షంలో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి శ్రీకంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవి, మైసమ్మతల్లి విగ్రహాలకు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు, జలాభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొంగోని వీరన్నగౌడ్, కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పైడిపల్లి ఆనందంగౌడ్, ఉపాధ్యక్షుడు పైడిపల్లి అయోధ్యగౌడ్, బుర్ర సంపత్‌గౌడ్, పైడిపల్లి మల్లికార్జున్‌గౌడ్, మండ ఎల్లయ్యగౌడ్, గౌడ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట: జలాభిషేకానికి తరలివెళ్తున్న భక్తులు , గౌడ కులస్తులు